సాక్షి
మంచిర్యాల

బుధవారం : 10 : మే : 2023

పరీక్ష ఫలితమే.. జీవితం కాదు



జీవితం అంటే చదువులు, మార్కులు, ర్యాంకులు, ఉద్యోగాలు మాత్రమే కాదు. పరీక్షల్లో ఫెయిల్ అయితే జీవితంలో ఓడిపోయినట్లు కాదు.

8లో▸



జీరోషాడోపై అవగాహన

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ సెంటర్‌లో జీరో షాడోపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఖగోళ అద్భుతం కాంతి మాయాజాలం, నీడమాయంపై వివరించారు. నీడలేని రోజులు ఏడాదికి రెండు సార్లు వస్తాయని టీచర్లు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
38.0 /28.0

వాతావరణం

ఉదయం ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళ పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గురుకుల విద్యార్థుల ప్రతిభ

మంచిర్యాలటౌన్: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకుల విద్యాలయాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. ఫస్టియర్ ఫలితాల్లో లక్సెట్టిపేట, జైపూర్, కోటపల్లి గురుకుల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, బెల్లంపల్లి సీఓఈ గురుకులంలో 91.43 శాతం, బెల్లంపల్లి గురుకులంలో 80.85 శాతం, చెన్నూరు 87.67 శాతం, కాసిపేట 88.89 శాతం, మందమర్రి 71.79 శాతం, మంచిర్యాల 60.87 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మొత్తం 876 మంది విద్యార్థులకు గాను 808 మంది పాస్ కాగా, 64 మంది ఫెయిల్ అయ్యారు. 93.57 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో లక్సెట్టిపేట, జైపూర్‌లు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, బెల్లంపల్లి గురుకులం 91.55 శాతం, బెల్లంపల్లి సీవోఈ 84.29 శాతం, చెన్నూరు 84.29 శాతం, కాసిపేట 97.85 శాతం ఉత్తీర్ణత సాధించారు. 667 మందికి గాను 644 మంది పాస్ కాగా, 23 మంది ఫెయిల్ అయ్యారు. 97.39 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ వొకేషన్ ఫస్టియర్, సెకండియర్‌లో లక్సెట్టిపేట, జైపూర్ గురుకులాలు 100 శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటాయి.

తెలంగాణ మైనార్టీ గురుకులాల్లో..

మంచిర్యాలటౌన్: తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభను చాటారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో మంచిర్యాల బాలికల మైనార్టీ గురుకులంలో 22మంది పరీక్షలు రాయగా, ఒక్కరు ఫెయిల్ అయ్యారు. బెల్లంపల్లి బాలికల మైనార్టీ గురుకులంలో 20మంది పరీక్షలు రాయగా ముగ్గురు ఫెయిల్ అయ్యారు. చెన్నూర్ బాలుర మైనార్టీ గురుకులంలో 13మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇద్దరు ఫెయిల్ అయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మంచిర్యాల బాలికల గురుకులంలో 24మంది పరీక్షలు రాయగా, ఒకరు ఫెయిల్ అయ్యారు. బెల్లంపల్లి బాలకల మైనార్టీ గురుకులంలో 19మంది పరీక్షలు రాయగా ఒక్కరు ఫెయిల్ అయ్యారు. చెన్నూర్ బాలుర మైనార్టీ గురుకులంలో 9మంది విద్యార్థులు పరీక్షలు రాయగా నలుగురు ఫెయిల్ అయ్యారు.

పోటీ పరీక్షల్లో విజయం సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలటౌన్: నిరుద్యోగ యువతీ, యువకులు ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ కళాశాల భవనంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం శిక్షణ పొందిన యువతీ, యువకుల కు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేశారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పి.రవీందర్‌రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, సహాయ సాంఘిక సంక్షేమాధికారి రవీందర్, శిక్షకులు శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్‌కే 7 గనిని సందర్శించిన డీసీపీ



గని వద్ద డీసీపీ సుధీర్, అధికారులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 7 గనిని మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం సందర్శించారు. గని లోపల పని స్థలాలను పరిశీలించారు. కార్మికుల విధులు, బొగ్గు బయటకు తీసే ప్రక్రియపై గని మేనేజర్ సాయిప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ సింగరేణి గని కార్మికులు ప్రకృతికి విరుద్ధంగా భూమి లోపలికి వెళ్లి బొగ్గును బయటకు తీసి ఈ దేశానికి వెలుగులు అందిస్తున్నారని, వారి శ్రమ వెల కట్టలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ రాజు, ఎస్సై మానస, రక్షణాధికారి రవిశంకర్, అండర్ మేనేజర్లు వెంకటరామ్, లక్ష్మణ్, శశాంక్ సాయి, ఇంజినీర్ తోట రమేశ్ పాల్గొన్నారు.

బాలికలదే పైచేయి..



బెల్లంపల్లి: విద్యార్థులను అభినందిస్తున్న సీఓఈ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

- ఇంటర్‌లో మెరుగైన ఫలితం
- ద్వితీయ సంవత్సరంలో 17వ స్థానం
- ప్రథమ సంవత్సరంలో 18వ స్థానం

సంవత్సరం	విద్యార్థులు	హాజరైన వారు	పాసైనవారు
ప్రథమ(జనరల్)	బాలురు	2616	1215
	బాలికలు	3040	2014
ద్వితీయ(జనరల్)	బాలురు	2612	1454
	బాలికలు	3298	2349
వొకేషనల్(ప్రథమ)	బాలురు	709	302
	బాలికలు	545	364
వొకేషనల్(ద్వితీయ)	బాలురు	622	412
	బాలికలు	516	441



మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా స్థానం మెరుగైంది. గత ఏడాది ఫలితాలతో పోల్చితే రాష్ట్ర స్థాయిలో పైకి ఎగబాకింది. ఎప్పటి వలే బాలికలు సత్తా చాటారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో విద్యార్థినులే అధిక శాతం ఉత్తీర్ణులయ్యారు. మార్చి 15నుంచి ఏప్రిల్ 3వరకు ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించారు. మొదటి సంవత్సరంలో 5,656 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 3,229 మంది 57శాతం పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 5,910మంది పరీక్షలు రాయగా 3,803 మంది 64శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 1,254మందికి గాను 666 మంది 53శాతం, ద్వితీయ సంవత్సరంలో 1,138మందికి గాను 853 మంది 74శాతం ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 17వ స్థానంలో నిలువగా, ప్రథమ సంవత్సరంలో 18వ స్థానంలో నిలిచింది. గత ఏడాది ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 24వ స్థానం నుంచి 17వ స్థానానికి, ప్రథమ సంవత్సరంలో 30 నుంచి 18వ స్థానానికి చేరడం గమనార్హం.

సత్తా చాటిన బాలికలు..

ఇంటర్ ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. ప్రథమ సంవత్సరంలో బాలురు 46శాతం ఉత్తీర్ణత పొందారు. 66శాతం ఉత్తీర్ణతతో బాలికలు పైచేయి సాధించారు. ద్వితీయ సంవత్సరంలో బాలురు 55శాతం ఉత్తీర్ణత సాధించగా... బాలికలు 71శాతంతో ముందంజలో నిలిచారు.

సీఓఈ విద్యార్థుల ప్రతిభ

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సీ(సీఓఈ) కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. ద్వితీయ సంవత్సరంలో 97శాతం ఉత్తీర్ణత సాధించారు. 63మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షకు హాజరు కాగా 58మంది ఏ గ్రేడ్, నలుగురు బీ గ్రేడ్ సాధించారని ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. ఎంపీసీ సెకండియర్‌లో సిలివేరు విజయ్ 969 మార్కులు, బైపీసీలో మల్లెపూల సాయి 954 మార్కులతో కళాశాల టాపర్స్‌గా నిలిచారు. బైపీసీలో 32మందికి విద్యార్థులకు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, ఎంపీసీలో 31మందికి 31మంది పాస్ కాగా, ఒకరు ఫెయిలయ్యారు.

ప్రథమ సంవత్సరం

ప్రథమ సంవత్సరంలో 70 మంది పరీక్ష రాయగా, 41 మంది ఏ గ్రేడ్, 17 మంది బీ గ్రేడ్, ఆరుగురు సీ గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించగా, ఆరుగురు ఫెయిలయ్యారు. ఎంపీసీ విభాగంలో గొల్ల బలరాముడు 470 మార్కులకు గాను 460, బైపీసీలో మూడ్ సాయికిరణ్ 440 మార్కులకు గాను 410 సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారు. విద్యార్థులను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సంక్షేమ గురుకులాల ఆర్‌సీఓ కొప్పుల స్వరూపారాణి, ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, అధ్యాపకులు శ్రీరామవర్మ, మిట్టా రమేష్, కట్ల రవీందర్, గాజుల రాజేందర్, అనుముల అనిరుధ్, ఆకెనపల్లి రాజేష్, ఎండి రఫీ, అర్జున్, లక్ష్మీనారాయణ అభినందించారు.

'మోడల్' టాపర్..



కోటపల్లి: మండల కేంద్రం కోటపల్లికి చెందిన కాగితపు మంజు భార్గవిని తండ్రి వండ్రంగి పనులు చేస్తూ మోడల్ స్కూల్లో చదివిస్తున్నాడు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో 464 మార్కులతో కళాశాల టాపర్ నిలిచి జిల్లాలో రెండో ర్యాంక్ సాధించింది. మంజు భార్గవిని జిల్లా ఎంపీపీ మంత్రి సురేఖా, వైస్ ఎంపీపీ వాలశ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి అభినందించారు.

– కాగితపు మంజు భార్గవి

అమ్మ కూలీ పని చేసి చదివిస్తోంది..



లక్సెట్టిపేట: నాన్న ఆయిడపు సర్సయ్య నా చిన్నప్పుడు చనిపోవడంతో అమ్మ శారద కష్టపడి కూలీ పనులు చేసుకుంటూ చదివిస్తోంది. ఒకటో తరగతి నుంచి ఐదవ తరగతి వరకు మా గ్రామం కత్తెరశాలలోని ప్రైమరీ పాఠశాలలో, ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చెన్నూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివాను. ఇంటర్మీడియెట్ స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో పూర్తి చేశాను. ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూపులో 989 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉంది. కళాశాల ప్రిన్సిపాల్ గౌతంరెడ్డి, అధ్యాపకుల ప్రోత్సాహంతో మార్కులు సాధించాను. బీటెక్ పూర్తి చేసి మంచి ఉద్యోగం సంపాదించి అమ్మ కష్ట పడకుండా చూసుకుంటాను.

– గణేష్, ఎంపీసీ రాష్ట్ర ఆరో ర్యాంకర్

రాష్ట్ర స్థాయిలో 'ఫస్ట్'ఇయర్



శ్రీరాముల హరిత



మేకల సాత్విక

మందమర్రిరూరల్: మందమర్రిలోని మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభకనబర్చారు. ఫస్టియర్ ఎంపీసీలో శ్రీరాముల హరిత 468/470 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు హరితను అభినందించారు. హరిత తండ్రి వెంకటేష్ మంచిర్యాలలోని జన్మభూమినగర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తాడు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి చేతుల మీదుగా హరితను సన్మానించనున్నారు. ఇంటర్ ఎంపీసీ సెకండియర్‌లో మేకల సాత్విక 986/1000 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించింది.

వ్యవసాయ కూలీల బిడ్డలు..



శ్రీకాంత్



భవాని

చెన్నూర్: చెన్నూర్ ప్రభుత్వ కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్న గ్రామీణ ప్రాంతాలకు చెందిన వ్యవసాయ కూలీల బిడ్డలు రాష్ట్ర స్థాయి ర్యాంక్‌లు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు. మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన దబ్బెట పద్మ, శంకర్ దంపతుల కూతురు భవాని ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో 1000 మార్కులకు గాను 974 మార్కులు, కోటపల్లి మండలం మల్లంపేట గ్రామానికి చెందిన ఆత్కూరి శంకర్, సావిత్రి దంపతుల కుమారుడు ఆత్కూరి శ్రీకాంత్ సీఈసీలో 1000 మార్కులకు 970 మార్కులు సాధించారు. ఎంపీసీలో సాహితి 1000 మార్కులకు 941, ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ విద్యార్థి సహజ 500 మార్కులకు 404 మార్కులు సాధించారు. భవాని, శ్రీకాంత్ తల్లిదండ్రులు రోజువారీ కూలీగా పని చేస్తూ పిల్లలను చెన్నూర్‌లో చదివించారు. భవాని, మహేశ్ చింతలపల్లి, మల్లంపేట గ్రామాల నుంచి ప్రతీ రోజు ఆర్టీసీ బస్సులో రాకపోకలు సాగించి రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంక్ సాధించి, జిల్లా టాపర్‌గా నిలిచారు. గ్రూప్స్ సాధించడమే తన లక్ష్యమని ఆత్కూరి శ్రీకాంత్ తెలిపాడు. డాక్టర్ కావాలనేది తన తల్లిదండ్రుల ఆశయమని, సాకారం చేసేందుకు కష్టపడి చదువుతానని దబ్బెట భవాని పేర్కొంది.

అప్పుడు అక్క.. ఇప్పుడు చెల్లె టాపర్



కళాశాల టాపర్లు అశ్విత, అమిత

కోటపల్లి: మండల కేంద్రంలోని మోడల్ కళాశాల విద్యార్థిని కొట్టె అశ్విత కళాశాల టాపర్‌గా నిలిచింది. గత సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో అశ్విత అక్క కొట్టె అమిత 908 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలువగా.. ప్రస్తుతం ఫలితాల్లో ఎంపీసీలో అశ్విత 969 మార్కులతో టాపర్‌గా నిలిచింది. తల్లిదండ్రులు దేవేందర్, పద్మ వ్యవసాయం చేస్తూ చదివించారు. 6వ తరగతి నుంచి ఇద్దరు అక్కాచెల్లెలు ఇద్దరు మోడల్ కళాశాలలోనే చదివి ప్రతిభ కనబరిచి టాపర్స్‌గా నిలవడం గమనార్హం.

రైతులకు సత్వర న్యాయం



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ఉదయ్‌కుమార్

నస్పూర్: అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయ సలహా కేంద్రం ద్వారా రైతులకు సత్వర న్యాయం అందించడానికి వీలవుతుందని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.ఉదయ్‌కుమార్ తెలిపారు. సీతారంపల్లి రైతు వేదిక వద్ద జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అగ్రి లీగల్ క్లినిక్ న్యాయ సలహా కేంద్రాన్ని జడ్జి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం వద్ద ఇద్దరు వాలంటీర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. రైతుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించుకోవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బి.అనిత, ఎస్సై రవికుమార్, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, ప్యానల్ అడ్వకేట్లు కే.గంగన్న, ఎండీ.సంధాని, రైతు సమితి మండల అధ్యక్షుడు ఓడ్నాల రాయమల్లు, పాక్స్ చైర్మన్ సందెల వెంకటేశ్, కౌన్సిలర్ సురిమిల్ల వేణు, నాయకులు వెంకట్రామయ్య, సిరిపురం రామన్న, పురుషోత్తం, కొమురయ్య, మధుకర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బీఎల్‌వోలు సమన్వయంతో పని చేయాలి



కొనుగోలు కేంద్రం తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

చెన్నూర్: రాబోయే సాధారణ ఎన్నికల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్న కాకుండా బీఎల్‌వోలు సమన్వయంతో పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. స్థానిక షాదీఖానాలో నియోజకవర్గ స్థాయి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు బీఎల్‌వోలతో సమీక్షలు నిర్వహించి ఓటరు జాబితాలను పారదర్శకంగా తయారు చేయాలన్నారు. చెన్నూర్ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి శ్రీరాములు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ

చెన్నూర్‌రూరల్: మండలంలోని దుబ్బపల్లి, ఆస్నాద గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ మంగళవారం పరిశీలించారు. ఏఈవో సర్టిఫికెట్ లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయొద్దని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కొనుగోళ్లు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, ఆర్ఐ తిరుపతి పాల్గొన్నారు.

సమ్మెకే మొగ్గు!

- నోటీసులు పంపినా కొనసాగిన నిరసనలు
- తొలగిస్తామన్నా బెదరని జేపీఎస్‌లు
- హామీ వస్తేనే విధుల్లో చేరుతామని స్పష్టం
- ప్రభుత్వ తదుపరి చర్యలపై ఉత్కంఠ



కలెక్టరేట్ ఎదుట మంగళవారం శ్రమదానం చేసి నిరసన వ్యక్తం చేస్తున్న జేపీఎస్‌లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, అవుట్ సోర్సింగ్ కార్యదర్శులు (జేపీఎస్, ఓపీఎస్) పట్టు వదలకుండా సమ్మె కొనసాస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వం సమ్మె విరమించకపోతే సర్వీసు నుంచి తొలగిస్తామని హెచ్చరించింది. కార్యదర్శులకు వ్యక్తిగతంగా నోటీసులు పంపిస్తున్నా బెదరకుండా విధులకు దూరంగానే ఉన్నారు. గత నెల 28న తమ సర్వీస్‌ను రెగ్యులర్ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో జేపీఎస్, ఓపీఎస్‌లు నిరవధిక సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. 13రోజులుగా గ్రామాల్లో తమ రోజువారీ విధులకు దూరంగా ఉండి పలు విధాలుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదు. వెంటనే విధుల్లో చేరాలంటూ కలెక్టర్ బి.సంతోష్, అడిషనల్ కలెక్టర్ రాహుల్, డీపీవో, డీఎల్‌పీవోలు కార్యదర్శులతో జరిపిన చర్చల్లోనూ స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. ఇప్పటికే మండల పరిషత్ అధికారులు వాట్సాప్‌ల్లోనూ కార్యదర్శులకు ఫైనల్ నోటీసులు పంపారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటల్లోపు విధుల్లో చేరకపోతే సర్వీస్ నుంచి టర్మినేషన్ చేస్తామని నోటీసులు వచ్చినా బెదరకుండా సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సమ్మె కొనసాగింది.

ప్రొబేషనరీగానే విధులు

జిల్లాలో 310 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 51మంది రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ఇక జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న కార్యదర్శులతో కలిపి మొత్తం 218మంది ఉన్నారు. వీరిలో 41మంది అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న కార్యదర్శులు ఉన్నారు. నాలుగేళ్ల క్రితం విధుల్లో చేరినప్పుడు మొదట మూడేళ్లను ప్రొబేషనరీ కాలంగా పేర్కొంటూ రూ.15వేల వేతనంగా జేపీఎస్‌లకు చెల్లించారు. మూడేళ్ల తర్వాత నాలుగో సంవత్సరం నుంచి రూ.28,719 చెల్లిస్తున్నారు. మరో ఏడాది కూడా పూర్తయినా రెగ్యులర్ ఉద్యోగాల వలే పే స్కేల్ లేకుండా వేతనం మాత్రమే ఇస్తున్నారు. దీంతో తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

'రెగ్యూలర్' హామీ వచ్చేనా?

గ్రామాల అభివృద్ధిలో కీలకంగా ఉన్న జేపీఎస్‌లకు ఎటువంటి స్పష్టత రాకపోవడంతో యధావిధిగా నిరసనలు కొనసాగిస్తున్నారు. తమకు ప్రభుత్వం నుంచి కచ్చితమైన హామీ వస్తేనే విధుల్లో చేరుతామని తేల్చిచెబుతున్నారు. మరోవైపు ప్రభుత్వం సైతం సీరియస్‌గానే ఉంది. కొన్ని రోజులుగా విధులకు దూరంగా ఉండడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులపై ప్రభావం పడుతోంది. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత, జనన, మరణ ధ్రువీకరణ నుంచి పన్నుల వసూళ్లు, అభివృద్ధి పనుల పర్యవేక్షణ, రోజువారీగా రిపోర్ట్స్ ఆన్‌లైన్‌లో పొందుపర్చడం, ప్రత్యేక యాప్‌లో నమోదు నిలిచిపోయాయి. సమ్మె కారణంగా గ్రామాల్లో రోజువారీ పాలనకు ఆటంకం కలుగుతోంది. దీనిపై పంచాయతీరాజ్ అధికారులు ప్రత్యామ్నాయంగా కారోబార్లు, గ్రామ పంచాయతీ సిబ్బందిని విధుల్లోకి తీసుకుని రోజువారీగా కార్యకలాపాలు సాగేలా ప్రయత్నాలు చేశారు. సమ్మె విరమించేందుకు సంఘ నాయకులతో పలు మార్లు జిల్లా ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. విరమణకు అంగీకరించకపోగా రోజుకో తీరుగా నిరసనలు ఉధృతం చేశారు. సమ్మెకు ప్రతిపక్ష నాయకులు, పౌర సంఘాల నేతలు, పలువురు మద్దతు ప్రకటించారు.

నేడు ఉదయం వరకు మరో అవకాశం..

నిరవధిక సమ్మెలో ఉన్న జేపీఎస్, ఓపీఎస్‌లు బుధవారం ఉదయం వరకు విధుల్లో చేరేలా ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు డీపీఓ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. విధుల్లో చేరి బాధ్యతలు నిర్వర్తిస్తూ డిమాండ్లను పరిష్కరించుకునేలా జేపీఎస్, ఓపీఎస్ ప్రయత్నాలు చేయాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు విధుల్లో చేరాలని సూచించారు.

జిల్లాలో ఆరుగురు జేపీఎస్‌ల చేరిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జేపీఎస్, ఓపీఎస్‌లు మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో చేరాలని, లేని పక్షంలో తొలగిస్తామనే ప్రభుత్వ హెచ్చరిక మేరకు జిల్లాలో ఆరుగురు జేపీఎస్‌లు విధుల్లో చేరారు. ఈ మేరకు డీపీఓ వెంకటేశ్వర్‌రావుకు విధుల్లో చేరుతున్న లేఖ అందజేశారు. కాగా, హాజీపూర్ మండలం గుడిపేట–నంనూర్ జేపీఎస్ మల్లేశ్, లక్సెట్టిపేట మండల బలరావుపేట జేపీఎస్ శృతి, జైపూర్ మండలం వేలాల జేపీఎస్ గోపిచంద్‌నాయక్ విధుల్లో చేరారు. ఇక ప్రసూతి సెలవులో ఉన్న లక్సెట్టిపేట మండలం మిట్టపల్లి జేపీఎస్ మాధవి విధుల్లో చేరింది. ఇక సస్పెండైన వారిలో గుడిపేట జేపీఎస్ హరిత, మర్రిగూడ చంద్రమళి కూడా విధుల్లో చేరాలని సూచించారు.

కొనసాగుతున్న సమ్మె



నిరవధిక సమ్మెలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తమను రెగ్యులర్ చేయాలని జేపీఎస్, ఓపీఎస్‌లు మంచిర్యాల ఐబీ చౌరస్తాలో చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 12వ రోజుకు చేరింది. ఉదయం 8 గంటలకే కలెక్టరేట్ ఆవరణలో శుభ్రం చేస్తూ పిచ్చిమొక్కలు, చెత్త తొలగించి వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం ఐబీలోని దీక్ష శిబిరానికి చేరుకుని సామూహిక దీక్ష చేపట్టారు. డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాగా, వీరి సమ్మెకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి సంఘీభావం తెలియజేస్తూ నిబంధనల మేరకు నియామకమైన జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలని అన్నారు. జాతీయ స్థాయిలో పంచాయతీ అవార్డుల ఎంపికకు కృషి చేసిన కార్యదర్శుల వ్యవహారంలో సరైన నిర్ణయం త్వరగా తీసుకుని వెంటనే క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

పని ప్రదేశంలో ఉపాధి కూలీ మృతి


లచ్చు(ఫైల్)

చెన్నూర్‌రూరల్: ఉపాధి హామీ పనులు చేస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురై కూలీ మృతి చెందిన సంఘటన చెన్నూర్ మండలంలోని కన్నెపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మొగిలి లచ్చు((52) గ్రామ సమీపంలో జరుగుతున్న కుంట పూడిక తీత పనులకు వెళ్లింది. మిగతా వారితో కలిసి పనులు చేస్తుండగా ఒక్కసారిగా పని ప్రదేశంలో కుప్పకూలింది. దీంతో ఆందోళనకు గురైన తోటి కూలీలు వెంటనే గ్రామానికి తీసుకువచ్చారు. లచ్చు ఇంటికి చేరుకొనే లోపే ప్రాణాలు విడిచింది. ఎండ తీవ్రత కారణంగానే అస్వస్థతకు గురై మృతి చెందిందని స్థానికులు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో గంగాభవాణి గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వ పరంగా రూ.2లక్షల బీమా పరిహారం వచ్చేలా కృషి చేస్తామని వారు తెలిపారు.

సీనియర్ కార్మికులకు అవకాశం కల్పించాలి


మాట్లాడుతున్న బ్రాంచి కార్యదర్శి తిరుపతి

రెబ్బెన(ఆసిఫాబాద్): సర్ఫేస్ జనరల్ మజ్దూర్ కోసం దరఖాస్తు చేసుకునే కార్మికులకు బేసిక్ తగ్గకుండా సీనియర్ కార్మికులకు అవకాశం కల్పించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియాకు సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌గా సింగరేణి వ్యాప్తంగా కార్మికులను దరఖాస్తులు తీసుకోగా అందులో నుంచి కేవలం 96 మందికి అవకాశం కల్పించిందన్నారు. బేసిక్ తగ్గకుండా సీనియర్ కార్మికులకు అవకాశం కల్పించాల్సి ఉండగా దానిని తుంగలో తొక్కిన యాజమాన్యం ఏ క్యాటగిరిలోనైనా పనిచేసేలా నిబంధనలు పెట్టి దరఖాస్తులు తీసుకోవడం అన్యాయమన్నారు. దీంతో ఒక్కో కార్మికుడు రూ.15 నుంచి 20వేల వరకు నష్టపోవాల్సి వస్తోందన్నారు. సమావేశంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు మొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శేషు, మారం శ్రీనివాస్, నాయకులు రాజేష్ పాల్గొన్నారు.

పరీక్ష ఫలితమే.. జీవితం కాదు



- మార్కులు, ర్యాంకులే కొలమానం కాదు..
- ప్రముఖులెందరో చదువుల్లో పరాజితులే
- కఠిన నిర్ణయాలు సబబు కాదంటున్న మానసిక నిపుణులు

నిర్మల్‌ఖిల్లా: జీవితం అంటే చదువులు, మార్కులు, ర్యాంకులు, ఉన్నత ఉద్యోగాలు మాత్రమే కాదు. ఇవన్నీ విజయానికి కొలమానాలు కానేకాదు. మరి ఎందుకు చదువుకోవాలి.. దాని పరమార్థం ఏమిటి? మన జీవితంలో చదువు, కెరీర్‌ల పాత్ర ఏమిటి? గొప్పగొప్ప వాళ్లంతా పెద్దపెద్ద చదువులు చదివినవాళ్లేనా? ... పలు పరీక్షా ఫలితాల నేపథ్యంలో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

ఒత్తిడే కారణం..
ఇంటర్, పదో తరగతి, నీట్, ఎంసెట్, ఐఐటీ, పోటీ పరీక్షలు ఏవైనా ఫలితాల సమయంలో ఒత్తిడి సహజం. వీటి ప్రభావంతో తీసుకున్న కఠిన నిర్ణయాలైన ఆత్మహత్యలు అప్పుడప్పుడూ తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. పదో తరగతి, ఇంటర్ ఇతర ప్రవేశ పరీక్షల్లో ఫెయిల్యూర్‌ను విద్యార్థులు భరించలేకపోవడం దీనికి ముఖ్యకారణం. ఇంటి నుంచే కాకుండా.. సమాజం నుంచి కూడా వచ్చే ఒత్తిడి దీనికి కారణమని మానసిక నిపుణులు అంటున్నారు.

చదువు తెలివితేటల కోసమే..
తల్లిదండ్రులు తిడతారని ఒకరు.. స్నేహితుల వద్ద తలెత్తుకులేమని ఇంకొకరు.. సమాజంలో పరువు పోతుందని మరొకరు.. ఇలా ఏదో కారణంతో విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. చదువులో వెనకబడి ఉండి కూడా జీవితంలో ఊహించని సక్సెస్ అందుకున్న వాళ్లు కోకొల్లలు. డిగ్రీ పట్టా లేకపోయినా వివిధ రంగాల్లో అసమాన్య ప్రతిభ కనబర్చినవారు బోలెడుమంది ఉన్నారు. ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయితే అదేం జీవితంలో ఫెయిల్ అయినట్టు కాదు. విద్యార్థులకు మరో అవకాశం ఉంటుంది. సప్లిమెంటరీలు రాసి మళ్లీ పాస్ కావచ్చు. క్రీడలు, సినిమా, బిజినెస్ లాంటి పలురంగాల్లో అవకాశాలు చాలా ఉన్నాయి. చదువు నిన్ను అవగాహన పరంగా మరో మెట్టు ఎక్కించడానికి మాత్రమే. చదువులో ఫెయిల్ అయితే బతుకులో ఫెయిల్ అయినట్టు కాదు. సరిగ్గా అనుకుంటే చులకనగా చేసిన సమాజం ముందే తలెత్తుకొని జీవించవచ్చు. వివిధ రంగాల్లో ఉన్నతంగా ఎదిగిన అలాంటి వ్యక్తుల ఉదాహరణలు మచ్చుకు కొన్ని....

కమల్‌హాసన్.. సినీనటుడు



నటనలో యావత్ భారతాన్ని ఒక్క ఊపు ఊపిన వారిలో కమల్‌హాసన్ ఒకరు. ఆయన చిన్నప్పుడు స్కూల్ డ్రాప్ అవుట్. పదో తరగతి కూడా చదవలేదు. అయితే నేం నాలుగు దక్షిణ భారత భాషల్లో అనర్గళంగా మాట్లాడటం, రాయటం, చదవడంపై పట్టుసాధించాడు. కమల్‌హాసన్ నటుడు మాత్రమేకాదు రచయిత, డైరెక్టర్, ప్రొడ్యుసర్, ప్లేబ్యాక్ సింగర్.. మల్టీటాలెంటెడ్ స్టార్‌గా ఎదిగాడు.

మహేంద్రసింగ్ ధోని.. క్రికెట్ ఆటగాడు



మనదేశ ప్రఖ్యాత క్రికెటర్లలో ఒకరైన మహేంద్ర సింగ్ ధోనికి తన చిన్నతనంలో చదువు పట్ల పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. చిన్నప్పుడు బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ ఆటలు ఆడేవాడు. ధోనీ గోల్ కీపర్‌గా ఫుట్‌బాల్ ఆడుతున్నప్పుడు, అతడి కోచ్ అతడిని స్థానిక క్రికెట్ క్లబ్‌లో వికెట్ కీపర్‌గా ఆడటానికి ఎంపిక చేశాడు. కాలక్రమేణా క్రికెట్ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన ధోని కుటుంబాన్ని పోషించుకోవడానికి రైలు టిక్కెట్ ఎగ్జామినర్‌గా పనిచేశాడు. 2004లో భారత క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. భారత క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఎదిగి ఎన్నో రికార్డులను సాధించాడు.

క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దు



క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు. స్థిరంగా ఆలోచించుకోవాలి. మార్కులు, ర్యాంకులు కొలమానం కాదు. చదువుల్లో రాణించని ఎందరో ప్రముఖులు తాము ఎంచుకున్న ప్రత్యామ్నాయ రంగాల్లో ఉన్నతంగా ఎదిగిన వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలి. మానసికంగా దృఢంగా ఉండేలా విద్యార్థులు, యువతకు తల్లిదండ్రులే మార్గనిర్దేశనం చేయాలి. - మోత్కూరి రాంచందర్, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

ఎంతోమంది..

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ఎంటర్‌ప్రెన్యూర్ నారాయణ మూర్తి, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఎయిర్ డెక్కన్ కెప్టెన్ గోపీనాథ్, వరల్డ్ చాంపియన్ సుశీల్ వ్యాపార వేత్త సుభాష్‌చంద్ర గోయెంకా వీరందరి ప్రయాణం ఉన్నత చదువులతో ప్రారంభం అవ్వలేదు. అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎన్నో ఒడిదుడుకులు, అవమానాలను ఎదుర్కొని కష్టపడి ఎదిగినవాళ్లు. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని, పదిలో ఫెయిల్ అయ్యారని తనువు చాలించాలనే నిర్ణయానికి రావడం సబబేనా.. ఓ సారి ఆలోచించండి..


వ్యాపార వేత్త సుభాష్ చంద్ర గోయెంకా

ఆత్మవిశ్వాసం ఉంటే చాలు...



దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామానికి చెందిన డాక్టర్ వెల్మల మధు ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వేలాది మంది పోటీ పడిన డీఎల్ పరీక్షలో ఆయన ఎందర్నో వెనక్కినెట్టి ఉద్యోగం సంపాదించుకున్నారు. ఆయన ఒకప్పుడు ఇంటర్‌లో పరీక్ష తప్పాడు. డిగ్రీలోనూ అంతే ముందుకెళ్లలేకపోయాడు. తనవల్ల కాదని ప్రయివేటులో చిన్నాచితక ఉద్యోగాలు చేస్తూ పోయాడు. కొన్నేళ్ల తర్వాత తనమిత్రులను చూసి స్ఫూర్తిని పొందాడు. ఆగిన చదువును పట్టాలెక్కించి డిగ్రీ నుంచి వృక్షశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొందేదాకా ఎక్కడా వెనుదిరిగి చూడలేదు. ప్రస్తుతం వివిధ అంశాలలో ప్రావీణ్యం సంపాదించి అనేక పరిశోధన పత్రాలను, అంతర్జాతీయ స్థాయిలో సమర్పిస్తూ రాణిస్తున్నారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకులాల హవా

- ఫస్టియర్‌లో 2వ, సెకండియర్‌లో 4, 5వ ర్యాంక్‌లు
- విద్యార్థినులను అభినందించిన ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి


రాష్ట్ర వ్యాప్తంగా 4వ ర్యాంక్ సాధించిన టి.వర్షిత


రాష్ట్ర వ్యాప్తంగా 5వ ర్యాంకు సాధించిన సీహెచ్ సుధారాణి


ఉట్నూర్‌రూరల్: తెలంగాణ గిరిజన గురుకులాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని 13కళాశాలల్లో 95.27శాతం, మొదటి సంవత్సరంలో 85.12శాతం ఫలితాలు సాధించినట్లు ఆర్సీవో గంగాధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ సెకండ్ ఇయర్ సీఈసీలో టి.వర్షిత (ఉట్నూర్ కళాశాల) 946 మార్కులు, సీహెచ్ సుధారాణి (ఆసిఫాబాద్ కళాశాల) 945 మార్కులతో రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకులాల్లో 4వ, 5వ ర్యాంక్‌ను సాధించినట్లు తెలిపారు. అలాగే ఆసిఫాబాద్ గురుకులానికి చెందిన ఆర్.కార్తీక 458 మార్కులతో బైపీసీలో రాష్ట్రంలోనే 2వ ర్యాంక్‌ను సాధించినట్లు తెలిపాడు. సెకండ్ ఇయర్ ఫలితాల్లో ఇంద్రవెల్లి, తిర్యాణి, ఆసిఫాబాద్, జైనూర్ బాలికల జూనియర్ కళాశాల 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 1117 మందికి 1068 మంది ఉత్తీర్ణత సాధించగా 49 మంది ఫెయిలైనట్లు తెలిపాడు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 1279 మందికి 1104 మంది ఉత్తీర్ణులు కాగా 175 మంది అనుత్తీర్ణులైనట్లు పేర్కొన్నాడు. గురుకుల జూనియర్ కళాశాలల్లో సెకండ్ ఇయర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 4, 5వ ర్యాంక్ సాధించిన వర్షిత, సీహెచ్ సుధారాణి, 2వ ర్యాంకు సాధించిన ఆర్.కార్తీకను ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి, ఆర్సీవో గంగాధర్ అభినందించారు.

15న జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 15న శుక్రవారం మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి కౌశిక వెంకటరమణ తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకులో ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థుల వయస్సు 26ఏళ్లలోపు వారై ఉండాలని, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు తెలంగాణలో ఎక్కడైనా పని చేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సెల్ నం. 9111731173, 6304600392 సంప్రదించాలన్నారు.

చేపల చెరువులో విషప్రయోగం?


చనిపోయిన చేపలను ట్రాక్టర్లలో వేస్తున్న స్థానికులు


చెరువులో చనిపోయిన చేపలు

కోటపల్లి: మండలంలోని ఆలుగామ చేపల చెరువులో సుమారు 3వేల చేపలు ఒకేసారి మృతి చెందినట్లు రైతు చిన్నన్న వాపోయాడు. బాధితుల వివరాల ప్రకారం... ఆలుగామ గ్రామానికి చెందిన రాంటెంకి చిన్నన్న తనకున్న భూమిలో మూడేళ్ల క్రితం సుమారు రూ.4వేల చేపలను చెరువులో వేసి పెంపకం చేస్తున్నాడు. మంగళవారం ఉదయం చేపలు పట్టడానికి చెరువుకు వెళ్లి చూడగా చేపలు చనిపోయి బయటికి తేలి కనిపించాయి. చేపలు ఒక్కసారిగా మరణించిన విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లగా ఎస్సై వెంకట్ చేరుకుని పరిశీలించాడు. చేపల చెరువులో విషప్రయోగం చేశారా? లేక ఏదైనా వ్యాధి సోకి చనిపోయాయా అనేది విచారణలో తేలాల్సి ఉంది. చేపల మృతితో సుమారు రూ.6లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు రాంటెంకి చిన్నన్న వాపోతున్నాడు.

గాలి దుమారానికి కూలిన ఇళ్లు

నెన్నెల: మండలంలోని మైలారం గ్రామంలో మంగళవారం భారీ గాలి దుమారానికి గిరిజన కుటుంబానికి చెందిన ఎడ్ల మల్లేష్‌కు చెందిన పెంకుటిళ్లు కూలి నేలమట్టమైంది. రెక్కాడితే కాని డొక్కాడని తమ బతుకులు ఇలా ఆగమయ్యాయని బాధిత కుటుంబం వాపోయింది. సామగ్రి మొత్తం చెడిపోవడంతో సుమారు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు.


కూలిన ఇంటి ఎదుట బాధిత కుటుంబం

లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

బెల్లంపల్లిరూరల్: రెండో విడత గొర్రెల పంపిణీకి ఎంపికైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామంలో రెండో విడత గొర్రెల పంపిణీపై లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా డీడీలు చెల్లించాలని సూచించారు. డీడీలు, ధృవీకరణ పత్రాలు మండల పశువైద్యాధికారులకు అందించాలని తెలిపారు. మేలైన గొర్రెల సంతతిని పంపిణీ చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. గొర్రెల కొనుగోలు కోసం మహారాష్ట్రలోని షోలాపూర్, ఆంధ్రప్రదేశ్‌లోని కడప, ప్రకాశం, కర్ణాటకలోని బళ్లారి, కొప్పాల్‌లను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ గొల్లకుర్మలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం గొర్రెల పంపిణీ చేపట్టిందన్నారు. ఈ పథకాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీటీసీ సుభాష్‌రావు, ఎంపీడీవో రాజేందర్, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శంకర్, పశువైద్యాధికారి సుజాత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి రమేష్‌కుమార్

ఆరోగ్య మహిళా కేంద్రాల్లో పూర్తి సేవలు

- జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని హమాలీవాడ బస్తీద వాఖానాలో మంగళవారం ఆరోగ్య మహిళా కేంద్రంకు వచ్చిన మహిళలు, అక్కడి వైద్య సిబ్బందితో డీఎంహెచ్‌వో మాట్లాడారు. ఉదయం 9 గంటల్లోపే ఆరోగ్య మహిళా క్లినిక్‌లను తెరవాలని సూచించారు. ల్యాబ్‌లో వైద్య పరీక్షలకు సంబంధించి ముందస్తుగానే సరిపడా కిట్స్‌ను సమకూర్చుకోవాలని, అవసరమైన మందులను అందించాలని తెలిపారు. మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, డీపీవో ప్రశాంతి పాల్గొన్నారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసమే..
బెల్లంపల్లిరూరల్: మహిళల సంపూర్ణ ఆరోగ్య కోసమే వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మహిళా (క్లీనిక్)క్యాంపులను ఏర్పాటు చేయడం జరుగుతుందని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు అన్నారు. బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించి ఆరోగ్య మహిళా(క్లీనిక్) క్యాంపును ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. డెప్యూటీ డీఎంహెచ్‌వో విజయపూర్ణిమ క్లినిక్‌ను సందర్శించారు. డీపీవో ప్రశాంతి, తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎవంజలీన్, అనిష్, సమ్మయ్య ఉన్నారు.


వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

తాళంవేసి ఉన్న ఇంట్లో పట్టపగలు చోరీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని హన్మాన్‌బస్తీలో మంగళవారం మాడుప హరీష్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వన్‌టౌన్ ఎస్సై విక్టర్ వివరాల ప్రకారం... హరీష్ భార్య పక్షం రోజుల క్రితం తల్లిగారింటికి వెళ్లింది. అప్పటి నుంచి హరీష్ ఇంటి వెనకాల వీధిలో నివాసం ఉంటున్న తల్లిదండ్రులు వద్దకు వెళ్లి మధ్యాహ్నం భోజనం చేసి రాత్రి తన ఇంట్లో పడుకుంటున్నాడు. ఎప్పటి మాదిరిగానే ఉదయం 11గంటలకు ఇంటికి తాళం వేసిన హరీష్ తల్లిదండ్రుల వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వచ్చి తాళం తీయగా తలుపులు తెరుచుకోలేదు. అనుమానం వచ్చి గోడ దూకి ఇంటి వెనకాలకు వెళ్లి పరిశీలించగా బీరువాలోని రూ.1.50లక్షల నగదు, మూడు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.